క్లుప్తంగా

మహోన్నతమైన వ్యక్తి రోశయ్య



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్, అంధవరపు సూరిబాబు తదితరులు

నరసన్నపేట: తెలుగు ప్రజలు గర్వించదగిన మహోన్నతమైన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొనిజేటి రోశయ్య అని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక శర్వాణీ పాఠశాలలో రోశయ్య జయంతి పురస్కరించుకొని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో శర్వాణీ స్కూల్ వ్యవస్థాపకుడు అంధవరపు సూరిబాబు, డైరెక్టర్ సాయిరాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాన జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తృతం చేయాలి

నరసన్నపేట: జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం ధనంజయ, ట్రైనింగ్ ఎస్ఎఫ్ఏ గోవింద రెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడి

సారవకోట: మండలంలోని కూర్మనాథపురం రేషన్ డిపోపై శుక్రవారం విజిలెన్స్ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో రేషన్ బియ్యం 20 కేజీలు తక్కువగా, ఆరు పంచదార ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం రేషన్ డిపోలో ఉన్న సరుకులను ఆర్ఐ లక్ష్మికి అప్పగించారు. అయితే గ్రామంలోని టీడీపీలో ఉన్న వర్గపోరు కారణంగా రేషన్ డిపోపై దాడి జరిగినట్లు చర్చ జరుగుతోంది.

పొందూరులో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న ఎస్ఐ సత్యనారాయణ తదితరులు

పొందూరు: పట్టణంలో ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని పోలీసులు శుక్రవారం చేపట్టారు. గాంధీనగర్-1, 2, 3 వీధుల్లో ఇంటింటికీ వెళ్లి వాహనాల వివరాలను సేకరించి, రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశారు. వీధుల్లో అనుమానితంగా ఎవరైనా సంచరిస్తే సమాచారం అందించాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ బృందం పర్యటన



కొరగాంలో స్వచ్ఛ సర్వేక్షణ బృందం

బూర్జ: మండలంలోని కొరగాం సచివాలయం పరిధి కొరగాం, తమ్మినాయుడుపేట, కటకమయ్యపేట, బోరగవలస గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ బృందం శుక్రవారం పర్యటించింది. దీనిలో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, మరుగుదొడ్లు, గ్రామాల్లో పరిశుభ్రత పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకురాలు ఎ.పుణ్యశ్రీ, జిల్లా పంచాయతీ రిసోర్స్ కేంద్రం రిసోర్స్‌పర్సన్ ఎం.డి.ఖాన్, డివిజనల్ లెవల్ పంచాయతీ అధికారి గోపీబాల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

కొత్తూరు: మండలంలోని మెట్టూరు గ్రామ పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మొజ్జాడ రుక్మిణమ్మ అన్నయ్య, పార్టీ నాయకుడు చక్రపాణి(52) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలసలో ఆమదాలవలస పోలీసులు పేకాట శిబిరంపై శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. దీనిలో భాగంగా బరాటం సత్యనారాయణతో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,250ల నగదు స్వాధీనం చేసుకొని, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి జరిపామన్నారు.

కలుపు.. నివారిస్తే గెలుపు



వరినాట్లు వేసిన పొలం

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- వ్యవసాయాధికారి మన్మథరావు సూచనలు



సరుబుజ్జిలి: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వరిలో వెదజల్లు, నాట్లు వేసుకోవడం పద్ధతిలో రైతులు సాగు చేస్తున్నారు. అయితే సాగులో ప్రధానంగా రైతులకు వేధించే సమస్య కలుపు. దీనిని నివారిస్తేనే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. కలుపు మొక్కలు పోషకాలు, నీరు, సూర్యరశ్మి కోసం ప్రధాన పంటతో పోటీపడి పంట దిగుబడిని, నాణ్యతను గణనీయంగా తగ్గిస్తాయి. పొడి వెదసాగులో 35-45 శాతం, తడి (దమ్ము పట్టి) వెదసాగులో 20-25 శాతం, నాట్లు వేసే పద్ధతిలో 10-15 శాతం దిగుబడిని తగ్గిస్తాయి. కలుపు మొక్కలు చీడపీడలకు ఆవాసంగా మారి వాటి ఉద్ధృతి ఎక్కువ కావడానికి దోహదం చేస్తాయి. పంట కోత సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. నీరు, వాయు కాలుష్యానికి కారకాలుగా మారుతాయి. వరి పైరు సాగులో వివిధ రకాల గడ్డి జాతి, వెడల్పాకు జాతి కలుపు మొక్కలు ఆశించి పంట పెరుగుదలకు నష్టం కలిగించడాన్ని రైతులు చూస్తున్నారు. అందువలన కలుపు నివారణకు వివిధ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు రైతులకు సూచనలు అందజేస్తున్నారు. జిల్లాలో 1.70 లక్షల హెక్టార్లలో వరిసాగు విస్తీర్ణం జరుగుతుండగా, తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే కలుపు నివారించుకోవచ్చునని సూచిస్తున్నారు.

కలుపు రాకముందు నివారణ

అన్ని రకాల కలుపు మొక్కల నివారణకు విత్తిన 2-3 రోజుల్లో ప్రీతిలాక్లోర్ (ఏరేజ్, చెక్, పైలెట్, రిఫిట్, రేసర్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) 2 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి ఎకరానికి 1 లీటరు మందును లేదా అక్సాడయార్జిల్ 35 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

మొదట తేమశాతం సరిలేనప్పుడు 5-7 రోజుల్లో, తేమ లభ్యమైనప్పుడు పైరజో సల్ఫ్యూరన్ ఈథైల్ (సాతి అని మార్కెట్‌లో దొరుకుతుంది) రసాయన మందును ఎకరానికి 80 గ్రాములు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కలుపు వచ్చినప్పుడు నివారణ

- కలుపు వయస్సు 20-25 రోజుల (2-4 ఆకుల దశ)లో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు పనిచేస్తాయని రైతులు గమనించాలి. కలుపు జాతుల రకాల ఆధారంగా వాటి దశను అనుసరించి కలుపు మందులు ఎంచుకోవాలి. ఊద ఎక్కువగా ఉంటే 15-20 రోజుల సమయంలో సైహెలో ఫాప్ బుటైల్ (క్లించర్, రాప్అప్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) మందు 2 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి ఎకరానికి 400 మిల్లీలీటర్ల మందును తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.
- గడ్డి జాతులు, వెడల్పు ఆకు జాతి కలుపును నివారించుటకు 8-25 రోజులు వ్యవధిలో (2-4 ఆకుల దశ) బిస్పైరీబాక్ సోడియం (నామినీ గోల్డ్, తాకర్, అడోరా వంటి రకాలు మార్కెట్‌లో ఉంటుంది) ఎకరానికి 100 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి, తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేసి 4-5 రోజుల తర్వాత పలుచగా నీరును వదిలితే వారం రోజుల్లో కలుపు అంతా చనిపోతుంది.
- ఆరిక గడ్డి, పూతిక గడ్డి, చిప్పెర, గుంపుల గడ్డి, తుంగ, మొండి గడ్డి జాతులు ఉన్నప్పుడు 20-25 రోజుల సమయంలో ఫెనోక్సి ప్రోప్-పి-ఈథైల్ (రైస్ స్టార్ 6.7 శాతం లేదా విప్ సూపర్ 9.3 శాతం) 250 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు ఎకరాకు పిచికారీ చేసి, 4-5 రోజుల తర్వాత పలుచగా నీరును పెడితే వారం రోజుల్లో కలుపు చనిపోతుంది.
- మొండి గడ్డి జాతులతో పాటు వెడల్పు ఆకు జాతి కూర గడ్డి ఉంటే మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆల్మిక్స్)ను ఎకరాకు 8 గ్రాములు కలుపుకుని ఇథాక్సి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములను కలిపి ట్యాంక్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.
- పొలంలో వెడల్పు కూర గడ్డి జాతి కలుపు ఉంటే 25-30 రోజుల సమయం వరకు 2.4-డీ సోడియం సాల్ట్‌ను 400 గ్రాములు లేదా మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆల్మిక్స్)ను ఎకరానికి 8 గ్రాములు కలుపుకోవాలి. ఇథాక్సి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములను 200 లీటర్ల నీటికి కలిపి పలుచగా నీరు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.
- పొలంలో వెడల్పాకు కూర గడ్డి జాతి కలుపు, తుంగ మాత్రమే ఉంటే 25-30 రోజుల సమయం వరకు 2.4-డీ అమైన్ సాల్ట్‌ను 400 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటికి కలిపి పలుచగా నీరు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

గూడ్స్ షెడ్ తరలింపు సరికాదు



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ నుంచి గూడ్స్ షెడ్ హరిశ్చంద్రపురానికి తరలించడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి స్వార్థం, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ చేతకానితనం ఫలితంగా రైల్వే గూడ్స్ షెడ్ తరలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆధారపడి 11 గ్రామాలకు చెందిన దాదాపు వెయ్యి కుటుంబాలు జీవనం సాగిస్తున్నారన్నారు. మొద్దునిద్రలో ఉన్న కూన రవికుమార్ ఇప్పటికైనా మేల్కొని గూడ్స్ షెడ్ తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆమదాలవలస పట్టణ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పొందూరు నాయకుడు వండాన సూరపునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, కొత్తవలస పంచాయతీ వైస్ సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

పాతపట్నం: మండలంలోని అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని జెడ్పీ సీఈవో ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజా సూచించారు. మండలంలోని కాగువాడ గ్రామాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కాలువల్లో పూడిక, చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయనతో పాటు ఎంపీడీవో పి.చంద్రకుమారి, డిప్యూటీ ఎంపీడీవో వి.రామచంద్రరావు పాల్గొన్నారు.



కాగువాడ డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి..

పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జెడ్పీ సీఈవో, నియోజకవర్గ నోడల్ అధికారి ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజా అన్నారు. పాతపట్నంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలతో కలిసి పాల్గొన్నారు. సమావేశంలో పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట తహసీల్దార్లు ప్రసాదరావు, బాలకృష్ణ, హనుమంతరావు, వెంకటరావులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పాతపట్నం: మండలంలోని గంగువాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగువాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గంగువాడ, తెంబూరు, వెంకటాపురం, బద్దుమర్రి, లాబర, సింగుపురం, పెద్దలక్ష్మీపురం, పెద్దలోగిడి, పెద్ద సరియాపల్లి, పెద్ద మల్లిపురం, కొయ్యకొండ, బొమ్మిక, శిష్టు జగన్నాథపురం, గిట్టంగి, కోనంగి, పేడూరు, దేవుదల, కొంచాడపేట, గొందిలోవ, సన్యాసిరావుపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ

హిరమండలం: ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో శుక్రవారం సరుబుజ్జిలి పోలీసులు శక్తి టీమ్‌తో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ, ఎస్ఐ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీ ఎస్వీ రమణమూర్తి చెప్పారు. సరైన ధ్రువ పత్రాలు లేని వారిపై అపరాధ రుసుము విధిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో శక్తి టీమ్ హెచ్‌సీ సి.సోమేశ్వరరావు, సిబ్బంది నవీన్‌కుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.


ఆదర్శనీయుడు అల్లూరి

నేటి యువతకు అల్లూరి సీతారామరాజు ఆదర్శనీయుడని వక్తలు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అల్లూరి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో ఆయన పోరాట పటిమను కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

\- సాక్షి నెట్‌వర్క్



సారవకోట: అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గిరిజన నాయకులు



హిరమండలం: అల్లూరికి నివాళులర్పిస్తున్న అధికారులు



నరసన్నపేట: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుగంధర్ తదితరులు

మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి వాణి

నరసన్నపేట: కోర్టుల్లో పెండింగ్ కేసులు పరిష్కారానికి ఇరు పార్టీలు మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవాలని నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.వాణి సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వం ప్రాధాన్యతను శుక్రవారం వివరించారు. రానున్న 90 రోజులు మధ్యవర్తిత్వంపై ప్రత్యేక కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు జీవీజీ నాయుడు, రొణంకి కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలి

నరసన్నపేట: గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య పిలుపునిచ్చారు. మండలంలోని దేవాదిలో శుక్రవారం పర్యటించిన ఆమె పారిశుద్ధ్య కార్యక్రమాల కరపత్రాన్ని ప్రజలకు పంపిణీ చేశారు. జ్వరాల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం



జేసీబీతో చెట్టును తొలగిస్తున్న దృశ్యం

పొందూరు: మండలంలోని భగవానుదాసుపేట వద్ద రహదారిపై భారీవృక్షం నేలకూలింది. గురువారం అర్ధరాత్రి చెట్టు కూలిన సమయంలో రహదారిపై వాహనాలేవి ప్రయాణంలో లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే రోడ్డుకు మధ్యలో అడ్డంగా పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్ధరాత్రి 1 గంట సమయంలో ఎస్ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో భగవానుదాపేట చేరుకుని తొలగించారు.

వృద్ధుడు అదృశ్యం



మజ్జి జోగారావు

పొందూరు: మండలంలోని లోలుగు గ్రామానికి చెందిన మజ్జి జోగారావు మే 28వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 77028 48771, 63026 02329 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

రేషన్ కష్టాలు పట్టవా..?



గిరిజనులతో మాట్లాడుతున్న రెడ్డిశాంతి

- గిరిజనులను ఇబ్బంది పెట్టడం సరికాదు
- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం

కొత్తూరు: గిరిజనుల రేషన్ కష్టాలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజమెత్తారు. మండలంలోని గొట్టిపల్లి జీసీసీ డిపో నుంచి బియ్యం తీసుకొని కొండలు మధ్య నుంచి మోసుకెళ్తున్న గిరిజన లబ్ధిదారులతో శుక్రవారం మాట్లాడారు. బియ్యం కోసం కొండలు మీద నుంచి సుమారు 7 కిలోమీటర్లు నడిచి రావాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్గమధ్యలో వర్షం కురిస్తే బియ్యం తడిచి ముద్దవుతున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ వాహనాల ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తోందనే అక్కసుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. గిరిజనులు చంటి పిల్లలను వెంట పెట్టుకొని బియ్యం కోసం అష్టకష్టాలు పడి నడిచి వస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రజలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, మండల పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, నాగేంద్ర, తులసీ, అంపిలి బుచ్చిబాబు, మఠం పూర్ణ, సవర మోహన్‌రావు, సింహాద్రి, సవర రమేష్, సంజీవు, తిర్లంగి కృష్ణమోహన్, బొమ్మాళి గణేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోతున్నాం



గిరిజన గ్రామమైన గొట్టిపల్లి డిపోలో సిగ్నల్ సరిగా లేకపోవడంతో రోజులు తరబడి డిపో చుట్టూ తిరుతున్నాము. దీంతో పనులకు వెళ్లలేక ఉపాధి కోల్పోతున్నాం. బియ్యం ఉచితంగా ఇచ్చినా, ఉపాధి లేకపోవడంతో బియ్యం కొనుగోలు చేసినట్లు అవుతోంది.

\- సవర సావిత్రి, డెప్పిగూడ, కొత్తూరు మండలం

ఆటోలో వెళ్లాలంటే ఖర్చు



గొట్టిపల్లి జీసీసీ డిపో నుంచి కొండల మీదకు నడుకొని బియ్యం తీసుకొని వెళ్లాలి. ఒకవేళ ఆటోకి వెళ్లాలంటే మనిషికి రూ.20లు, బియ్యం మూటకి రూ.20లు చార్జీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే బియ్యం రావడం వలన ఎటువంటి ఇబ్బందులు, ఖర్చులు లేకుండా బియ్యం తీసుకునేవాళ్లం. - సవర మంగయ్య, చీపురపల్లి, కొత్తూరు మండలం

డిపో వద్ద వంట చేశాను



గొట్టిపల్లి జీసీసీ డిపో నుంచి బియ్యం తీసుకునేందుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చీపురుపల్లి నుంచి వచ్చాను. డిపో వద్ద ఎక్కువ మంది ఉండడంతో పాటు వేలి ముద్రలు వేగంగా పడకపోవడంతో రోజుల తరబడి డిపో చుట్టూ తిరుగుతున్నాం. గ్రామానికి వెళ్లి రావడం కష్టమవుతుండడంతో డిపో వద్ద వంట చేసి మధ్యాహ్న భోజనం చేశాక బియ్యం తీసుకొని వెళ్లాను.

\- సవర కొడమ్మ, చీపురుపల్లి, కొత్తూరు మండలం

అంగన్‌వాడీల ధర్నా నోటీసు



ధర్నా నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సారవకోట: సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఈనెల 9వ తేదీన చేపట్టనున్న ధర్నాపై ప్రాజెక్టు కార్యాలయం సూపర్‌వైజర్లకు శుక్రవారం నోటీసు అందించారు. పరిష్కారం కాని తమ సమస్యలైన కనీస వేతనం రూ.26 వేలతో పాటు గ్రాట్యూటీ, పెన్షన్ తదితర సదుపాయాలను కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఏర్పాటు చేసిన బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు శ్రీదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న పీవో యశ్వంత్ కుమార్

కొత్తూరు: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని లబ్బ, గొట్టిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన గదుల్లో పనులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు గదుల సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



సారవకోట: మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కృష్ణదాస్ తదితరులు

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ గ్రామానికి చెందిన కొండాల రాధమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు కొండాల బాబూరావు, సాధు సతీష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు గెల్లంకి వెంకటరావు, పోలాకి కేశవరావు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, వెలమల సింహాచలం, ఎడ్ల రంగారావు, యాళ్ల వెంకటరావు తదితరులున్నారు.

జలుమూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నవారిని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పరామర్శించారు. రామయ్యవలసలో సర్పంచ్ శిమ్మ నాగేశ్వరరావు, యలమంచిలికి చెందిన మెండ అప్పారావు అనారోగ్యంతో ఉండడంతో వారిని పరామర్శించారు. అలాగే పెద్ద దూగాంకు చెందిన కొట్టు జయలక్ష్మి, తమ్మయ్యపేటకు చెందిన సనపల చంద్రయ్య మరణించడంతో వారి కుటుంబాలను కలిసి సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు ఎంపీపీ వాన గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మథరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ధర్మాన జగన్, మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పైడి విఠల్, తర్ర మాధవి, మెండ రవికుమార్, బలగ అర్జున్, నవిరి పోతయ్య, వెలమల అసిరినాయుడు, పి.విజయ్, బోర రామకృష్ణ, వెలమల రామారావు, వెలమల అసిరినాయుడు, కర్రి అయ్యప్ప, సోమినేని కృష్ణ, కొర్ను రాజు తదితరులు ఉన్నారు.